# ఓ నరుడా! వానరుడా!



ముసలి సత్తెయ్య ఇంటింటి ముందుకూ వచ్చి కోతిని ఆడిస్తున్నాడు. కోతి ఛెంగు చెంగున గెంతుతోంది. కోతి నుదుటి మీద పొడుగ్గా తిలకం, మెడపట్టీకి చిన్నచిన్నమువ్వలు. సత్తెయ్య వెదురుబద్దతో తాళం వేస్తూ "తనక తనకజం తనక తనకజం...... రాములోరికి దణ్ణం పెట్టు ...... సీతమ్మోరికి దణ్ణంపెట్టు ..... లచ్చనసామికి దణ్ణం పెట్టు" అంటూ పాడుతూ ఆడిస్తున్నాడు. ఆ ఆటకి కోతి మెడలో మువ్వలు ఘల్లు ఘల్లు మంటున్నాయి.

కోతికి ఓ మాసికల చొక్కా. ఆచొక్కాకి ఓ జేబు. ఆ జేబులో శనగపప్పులు. మధ్యమధ్య ఆట ఆపి కోతి ఓ గింజ నోట్లో వేసుకుంటుంది. ఆట ఆపంగానే సత్తెయ్య గొంతు పెంచి తనక తనకజం' అంటూ టాంగున నేలమీద కొడతాడు. ఉలిక్కిపడ్డట్టు కోతి అంతెత్తు ఎగిరి మళ్ళీ ఆడుతుంది. ఆ ఎగరడం చూసి పిల్లలెవరైనా 'ఇహి' అని నవ్వితే తనూ 'ఇహిహి' అని పళ్ళికిలిస్తుంది.

కొంచెం జనం చేరి ఉత్సాహంగా చూడ్డం మొదలెట్టగానే ఆట వరస మారుస్తాడు సత్తెయ్య. "నా దేవుడా ఆడరా .... తనక తనకజం .... నా రావుడా ఆడరా ..... నా కొడకా ఆడరా ..... నా పెళ్ళావా ఆడవే"అనగానే కోతికి ఎంత కోపమో! ఆట ఆపి పళ్ళు బిగబట్టి "కరుస్తా" అన్నట్లు ఎగిరి సత్తెయ్య మీదకి దూకుతుంది. ఆ కోపమూ, ఆ కరవబోవడమూ అది కూడా ఆటలో భాగమే! అలా నేర్పాడు సత్తెయ్య.

అలా ప్రతి ఇంటి ముందు ఆడించుకుంటూ ఒంటి గంటవేళ కృష్ణ వొడ్డుకొచ్చి అన్నం వండుకుని, కోతికి పెట్టి, తను తిని, కోతిని గుండెలమీద పడుకోబెట్టుకుని చింతచెట్టు కింద నడుం వాలుస్తాడు సత్తెయ్య.

ఎక్కడదీ కోతి? ఎక్కడ పుట్టి ఎక్కడ పెరిగిందో!

సత్తెయ్యకి అటు వారూ ఇటు వారూ అంతా వెళ్ళిపోయాక, తనొక్కడే భూమ్మీద ఎందుకు మిగిలాడో తెలియని సమయంలో, పొట్టగడవాలి కాబట్టి అడవిలో కట్టెలు కొట్టి తెచ్చేవాడు. సంవత్సరం క్రితం కట్టెల మోపు నెత్తిన పెట్టుకు తిరిగొస్తుంటే ఓ చెట్టు మీంచి కోతి కట్టెలమోపుమీదికి దూకింది. కంగారుపడ్డ సత్తెయ్య కట్టెలమోపు వదిలేశాడు. మోపుతో కిందకుపడ్డ కోతి మళ్ళీ ఎగిరి సత్తెయ్య భుజం మీదికి వచ్చింది. ఎంత అదిలించినా వదల్లేదు. కిచ కిచ నవ్వింది. కళ్ళలో కళ్ళుపెట్టి చూసింది. అంతే! సత్తెయ్య దాన్ని ఆప్యాయంగా నిమిరి చంకలో పెట్టుకు తీసుకొచ్చాడు.

కోతికి పాత గుడ్డలతో చొక్కా కుట్టాడు. తనతోపాటు అన్నం అలవాటు చేశాడు. ఒకే కంచంలో తినేవారిద్దరూ. తనోముద్ద కోతి నోటి కందిస్తే కోతి లేచి తన చిట్టి చేతుల్తో నాలుగుమెతుకులు సత్తెయ్య నోట్లో పెట్టేది. ఆర్నెల్ల క్రితం సత్తెయ్యకి వయసు పై బడ్డది. సత్తువ మాయమయింది. కట్టెలు కొట్టి తేలేక దిగులుగా నీరసంగా కూర్చున్న సత్తెయ్యముందు కోతి చెంగు చెంగున తాళానికి ఎగరటం చూసి సత్తెయ్య కళ్ళు మెరిశాయి. ఆనాటి నుండి కోతినాడిస్తున్నాడు. కోతి కష్టం తను తింటున్నాడు.

గుండెలమీద పడుకున్న కోతిని ప్రేమగా నిమురుతూ సత్తెయ్య అన్నాడు. "ఈ ముసలి బాగులోడు ఆఖరిరోజుల్లో గంజిలేక సచ్చిపోతాడని అడివిలోంచి పరుగెత్తుకొచ్చావురా! నా దేవుడా! నా దేవుడా" అంటూ కళ్ళనీళ్ళయిపోయాడు.

పండగొచ్చింది. కోతికి మాసికల చొక్కా ఉతికి తొడిగాడు. తిలకంమీద తిలకం దిద్దాడు. జేబునిండా శనగపప్పు పోశాడు. కొత్త పెళ్ళికొడుకులా మహాసంబరంగా ఉంది కోతి అంత సంబరంతో ఆడిస్తున్నాడు సత్తెయ్య. "తనక తనకజం" కోతి చిందులు తొక్కుతోంది. హొయలు పోతోంది. సిగ్గు నటిస్తోంది. గాలిలో ఎగురుతోంది. మొగ్గలేస్తోంది. పల్టీలు కొడ్తోంది. కిచకిచ నవ్వుతోంది. ఎగరేసిన రేగిపండు ఎగిరి అందుకుంటోంది. జనం పొంగిపోయేట్టు ఆడుతోంది. సత్తెయ్య జోలె నిండిపోతోంది. పప్పులు. కూరలు. లడ్లు. బొబ్బట్లు. గారెలు.

ఆనందంగా క్రిష్ట వొడ్డుకొచ్చి జోలె వంచుకుని తినటం మొదలెట్టారిద్దరూ. కోతి తినలేక పోతోంది. అలిసి పోయిందేమోనని సత్తెయ్య బలవంతంగా తినిపించాడు. కడుపునిండా తిని కోతిని గుండెలమీద పెట్టుకుని చెట్టుకింద పడుకుంటే సత్తెయ్యకి నిద్ర పట్టింది. నిద్రలేచి "నా దేవుడా, నా తండ్రీ, నా కొడకా" అని కోతిని పలకరిస్తే కోతి పలకలేదు. కంగారుగా చూశాడు సత్తెయ్య.

కోతి సత్తెయ్యని ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయింది.

సత్తెయ్య చచ్చిపోయిన కోతిని గుండెలకి హత్తుకున్నాడు. నుదుట మళ్ళీ తిలకం దిద్దాడు. అలనాడు అడవిలో కట్టెల మోపు మీదికి దూకిందే ఆ చెట్టు దగ్గరకి మోసుకెళ్ళాడు. గొయ్యి తీసి మెత్తగా పసిపాపని పడుకోబెట్టినట్టు పడుకోబెట్టి, ఆఖరిసారి కోతి మెడలో మువ్వలు కుదిలించి మట్టి కప్పి, ఎదురుగా కూర్చుని వెదురుబద్దతో నేలమీద కొడ్తూ "తనక తనకజం ..... రాములోరికి దణ్ణంపెట్టు, సీతమ్మోరికి దణ్ణం పెట్టూ...." అంటూ రాత్రంతా పాడాడు.

మూడు రోజులు గడిచాయి. సత్తెయ్యకి ముద్ద లేదు. కూలికిపోవటానికి ఓపిక లేదు. ఓపిక లేకపోయినా ఆకలి మంట ఆగదు.

ఉన్నట్టుండి లేచాడు సత్తెయ్య. వెదురుబద్ద తీసుకొన్నాడు - ఇంటింటి ముందుకీ వచ్చాడు. "తనక తనకజం .... " అడుతున్నాడు. తనే ఆడుతున్నాడు. తనే కోతయి, కోతిలా ఆడుతున్నాడు. కోతిలా రెండు చేతులూ నేలకానించి ఆడుతున్నాడు. "రాములోరికి దణ్ణం పెట్టూ .... సీతమ్మోరికి దణ్ణంపెట్టూ .... కోతిలా పళ్ళికిలిస్తున్నాడు. కోతిలా కిచకిచలాడుతున్నాడు. కోతిలా శనగ పప్పు తింటున్నాడు. కోతిలా మొగ్గలేస్తున్నాడు. పల్టీలు కొడుతున్నాడు. కోతిలా గాలిలోకి ఎగరలేక ఎగురుతున్నాడు.

ఆహా! జనమంతా ఆట చూస్తున్నారు. కోతి ఆట చూసినట్టే సత్తెయ్య ఆట కూడా చూస్తున్నారు.

ఆట చూస్తున్న అయ్యలారా! పిల్లలుగన్న తల్లులారా! అమ్మలగన్న అమ్మల్లారా! కోతిసాయం పొందిన దేవుణ్ని కొలిచే దేవతల్లారా! సత్తెయ్య గొంతు చీరుకు పోయేట్టు పాడుతున్నాడే! ఎముకలు విరిగేట్టు ఆడుతున్నాడే! నెత్తురింకి పోయేట్టు ఎగురుతున్నాడే! కళ్ళముందు మనిషి జంతువుకంటే హీనమై పోతున్నాడే! కోతి ఆట చూసినట్టు ఆనందించి పైసలేస్తున్నారా అయ్యల్లారా!*